క్లుప్తంగా

'ఆదివాసీల గుడిసెలకు రక్షణ కల్పించాలి'

ఎటపాక: శ్రీరామ్‌నగర్ కాలనీ దమ్మక్క గూడెంలో ఆదివాసీల గుడిసెలకు భద్రాద్రి దేవస్థానం ఈవో నుంచి రక్షణ కల్పించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు ఇక్కడ మాట్లాడుతూ 2006 నుంచి నివసిస్తున్న ఆదివాసీల గుడిసెలకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. దేవస్థానం భూములను గిరిజనులకు, ఇతర పేదలకు పంచాలని, ఆదివాసీ చట్టాలను నిర్వీర్యం చేసే అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయన్న, శివ, ప్రశాంత్, పార్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజ మార్పు



పాస్టర్ సంజీవ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు, తదితరులు

అరకులోయ రూరల్: ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని పాస్టర్లు కోరారు. మండలంలో మాడగడ పంచాయతీ బెంజిపూర్ లూథరన్ చర్చి ఆవరణలో ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ దైవజనులు పాస్టర్లు యేసుపాదం, అబ్రహం, కిషోర్, బాబు, తదితరులను నూతన వస్త్రాలతో సన్మానించారు. ఆధ్యాత్మిక చింతనతోనే సమాజ మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సంఘస్తులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సుబ్బారావు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టీవీ సుబ్బారావు, దాసరి ఉమామహేష్, రాయుడు, శ్రీనివాస్, సంపత్‌కుమార్ పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి నేత్ర పరీక్షలు చేసి 16 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ నిమిత్తం కొంత మందికి వేమగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. ఏజెన్సీలో రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు సహాయకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు, వలంటీర్లు దాసరి పెద్ద అప్పారావు, అయినంపూడి సూర్యవర్మ, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

- పాడేరు డీఎస్పీ వేణుగోపాల్

అరకులోయ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని పాడేరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ అతిథి గృహంలో ఆదివారం ఆయన స్థానిక లాడ్జి, రిసార్ట్స్, హోటళ్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన పర్యాటక కేంద్రం కావడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వ్యాపారులు స్నేహ పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఐకమత్యంతో పర్యాటక కేంద్రాన్ని పరిరక్షిస్తూ మెలగాలన్నారు. సీఐ హిమగిరి, అనంతగిరి, అరకులోయ ఎస్ఐలు శ్రీనివాస్‌రావు, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కానరాని పర్యాటకుల తాకిడి

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయితోపాటు అంజోడ సిల్క్ ఫామ్ వద్ద పర్యాటకుల సందడి కానరాలేదు . శనివారం దసరా కావడంతో ఆదివారం ఇక్కడ ప్రకృతి అందాలు తిలకించేందుకు మైదాన ప్రాంతం నుంచి పెద్దగా ఎవరూ రాలేదు. వారం రోజులుగా దసరా సెలవులు కావడంతో పెద్ద ఎత్తున తరలి వచ్చిన వీరు ఒక్కసారిగా తగ్గిపోవడంతో చాపరాయి వద్ద పలచబడిపోయింది.



డుంబ్రిగుడ: అరకులో ప్రత్యేక హోమం చేస్తున్న దుర్గగుడి ఆలయ పూజారి



జి.మాడుగులలో భవానీ పీఠం వద్ద ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



జి.మాడుగుల గ్రామ పురవీధుల్లో దుర్గమ్మతల్లిని ఊరేగిస్తున్న భక్తులు



రాజవొమ్మంగి: దూసరపాములో దుర్గమ్మ పల్లకి ఊరేగింపులో భక్తులు

అమ్మా భవానీ.. కరుణించవమ్మా..

- ప్రణమిల్లిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ఆయుధ, వాహన పూజలు
- ఊరూవాడా దసరా సందడి
- అలరించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు
- వైభవంగా ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు

ఊరూవాడా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఎక్కడ చూసినా, ఎటు చూసినా అమ్మ భక్తులే.. జననీ శివకామినీ.. జయ శుభకారిణి.. విజయరూపిణి.. అమ్మవు నీవే అఖిల జగాలకు.. అమ్మలగన్నా అమ్మవు నీవే.. నీ చరణములే నమ్మితినమ్మా.. శరణము కోరితి అమ్మా భవానీ..! అంటూ ఆలయాల్లో అమ్మవారి ఎదుట ప్రణమిల్లారు. భక్తిశ్రద్ధలతో ఆయుధ, వాహన పూజ చేశారు. దేవీ శరన్నవరాత్రోత్సవాలు శనివారంతో అంగరంగ వైభవంగా ముగిశాయి.



కొయ్యూరు: శోభాయాత్రలో దుర్గమ్మ ప్రతిమ

జి.మాడుగుల: మండలంలో శని, ఆదివారాలు విజయదశమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామాల్లో ప్రజలు ఆయుధ, వాహన, యంత్ర పూజలు చేసి దుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భవానీ పీఠం వద్ద ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు మహిళలు, పుర ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దుర్గాదేవికి పలు రకాలు పిండి వంటలతో తయారు చేసిన సారెను మహిళలు సమర్పించారు. గ్రామ పురవీధుల్లో దుర్గా భవానీ దేవి పంచలోహ విగ్రహ ప్రతిమను డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ సర్పంచ్ కిముడు రాంబాబు, టీడీపీ నాయకులు, భక్తులు తలపై పెట్టుకొని కాలినడన ఊరేగించారు.

వేడుకగా శోభాయాత్ర..

కొయ్యూరు: దసరా సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం దసరా కావడంతో అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు కొయ్యూరు దుర్గమ్మ తల్లిని సందర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అధిక సంఖ్యలో భవానీ భక్తులు తరలివచ్చి ఇరుముళ్ల అనంతరం మాలలు విడిచిపెట్టారు. ఆదివారం కొయ్యూరు దుర్గమ్మ ప్రతిమతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శోభాయాత్రకు ఎస్ఐ నాగార్జున దగ్గరుండి భద్రతను పర్యవేక్షించారు. శోభాయాత్ర నిర్వహించి సింగవరం దుర్గమ్మ ప్రతిమను నిమజ్జనం చేశారు.

మార్మోగిన అమ్మవారి నామస్మరణ...

పెదబయలు: మండలంలో దసరా పండగా ఘనంగా నిర్వహించారు. హరిహరపుత్ర మోద మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక మోదకొండమ్మ ఆలయం నుంచి సీతగుంట వరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించి మత్స్యగెడ్డలో నిమజ్జనం చేశారు. జై దుర్గ, జైజై దుర్గా నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పెదబయలు మోటార్ యూనియన్ వాహనాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నూతన వాహనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఎస్ఐ రమణ ఆధ్వర్యంలో అనుపోత్సవానికి బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీగా బాణసంచా కాల్చారు. మండలంలో 23 పంచాయతీల్లో దసరా పండగ ఘనంగా జరిగింది. ఇళ్లలో ఆయుధ పూజ చేశారు. కార్యక్రమానికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి సింహాచలం, కిశోర్, భవానీ భక్తులు, గ్రామ పెద్దలు సూరయ్య,రాంబాబు, పరుశురాం, వర్తకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న థింసా నృత్యాలు...

డుంబ్రిగుడ: మండలంలోని అరకు, కించుమండ, గుంటసీమలతో పాటు డుంబ్రిగుడలో దసరా ఉత్సవాలను గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలతోపాటు గృహాల్లో వారి వాహనాలకు పూజలు చేశారు. థింసా నృత్యాలతో ఆయా గ్రామాల్లో గిరిజనులు సందడి చేశారు. డుంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ తన గృహంలో పూజలు చేశారు. మండల ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. అరకులో విజయదుర్గ పృథీశ్వరిమాత ఆలయంలో పూజరి సూరజ్ త్రివేది ముళ్లకంపల పిట్లాలో కూర్చొని ఊగుతూ ప్రత్యేక హోమాలు చేశారు. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డుంబ్రిగుడ నుంచి వేలాది భక్తులు సమీప అంతరాష్ట్ర చటువాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా దూసరపాము, రాజవొమ్మంగి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం దుర్గమ్మ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. దూసరపాములో కనకదుర్గమ్మ ఆలయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు బోనాలు తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో దుర్గాదేవిని డప్పువాయిద్యాల నడుమ వాహనంపై ఊరేగించి అనంతరం వటిగెడ్డ వాగులో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాల్లో నిమజ్జనం..

ఎటపాక: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయదశమి పర్వదినం శనివారం తోటపల్లిలో కొలువుదీరిన అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చి భక్తుల పూజలందుకున్నారు. ఆదివారం పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారిని ఉంచి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గుండాల, నంది గామ, తోటపల్లి గ్రామాల్లో అమ్మవారిని పవిత్ర గోదావరి జలాల్లో నిమజ్జనం చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

రంపచోడవరం: స్థానిక సంత మార్కెట్ దేవిగుడి సెంటర్‌లోని మాతృశ్రీ కనకదుర్గామాత గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శమీ పూజ జరిపించారు. స్థానిక స్టేట్ బ్యాంకు దగ్గర మోటార్ యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తులతో శమీ పూజలు జరిపించారు.



భవానీ పీఠం వద్ద దుర్గమ్మ తల్లికి మహిళలు సమర్పించిన వివిధ పిండి వంటకాలు



డుంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ ప్రత్యేక పూజలు



ఎటపాక: తోటపల్లిలో అమ్మవారి ఊరేగింపులో భక్తులు



పెదబయలు: అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భవానీ భక్తులు



జి.మాడుగులలో దుర్గమ్మ ప్రతిమను తలపై ఉంచి ఊరేగిస్తున్న సర్పంచ్ రాంబాబు

4 కిలోమీటర్ల ప్రయాణం నరకమే..

- విస్తరణకు నోచుకోని కాకరపాడు-కొయ్యూరు రోడ్డు
- పదేళ్లుగా వాహనదారుల ఇక్కట్లు
- వర్షం కురిస్తే వంతెనలపై నుంచే నీరు..



పూర్తిగా పాడైన రహదారి

ఈ ఫొటోను చూడండి.. గట్టిగా వర్షం కురిస్తే కాలువ వెంటనే పొంగుతోంది. గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఈ సమస్య దాదాపుగా 15 సంవత్సరాల నుంచి ఉంది. సింగవరం ఐటీడీఏ కాలనీ, కాకరపాడులో కొత్త వంతెనలు నిర్మించాల్సి ఉన్నా, ఇంత వరకు ఆ పని చేయలేదు.



కాలువ పొంగడంతో నిలిచిపోయిన బస్సులు (ఫైల్)



కాలువపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

కొయ్యూరు: దశాబ్దం కిందట ఆర్‌అండ్‌బీ అధికారులు కాకరపాడు వంతెనకు రూ.3 కోట్లు, ఐటీడీఏ కాలనీ వద్ద వంతెనకు రూ. కోటితో అంచనా వేసి నివేదించారు. నాటి నుంచి నేటి వరకు అది ఏమైందో తెలియని పరిస్థితి. కాకరపాడు నుంచి కొయ్యూరు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ నాలుగు కిలోమీటర్ల రహదారిపై పది సంవత్సరాలుగా వాహనాల సంఖ్య రెట్టింపైంది. రోడ్డు మాత్రం వెడల్పు కాలేదు. రోడ్డు వెడల్పు చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పంపిన ప్రతిపాదనలు అమలుకు నోచడం లేదు. పది సంవత్సరాలుగా ఇదే తంతు. ఇక రోడ్డు వెడల్పయితే రాజేంద్రపాలెంలో రెండు వైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉంటుందని చూస్తున్నారు.

వెడల్పు కాకపోవడంతో వర్షం నీరంతా రోడ్డుపైనే ఉంటుంది. దీని మూలంగా దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయి. కిందటి నెలలు కురిసిన వర్షాలకు కాకరపాడు, ఐటీడీఏ కాలనీ కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో ఐదు గంటలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ఎవరికి అత్యవసరమైనా ప్రాణాలపై ఆశ వదులుకోవలసిందే.

కలెక్టర్ దృష్టిలో ఉంచాం..



కాకరపాడు-కొయ్యూరు రహదారిని వెడల్పు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు తెలిపాం. ఆయన దీనిపై సానుకూలంగా స్పందించారు. వాహనాల సంఖ్య పెరగడంతో పాటు రహదారి పాడైంది. దీంతో పాటు ఎప్పుడో నిర్మాణం చేసిన వంతెనలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మాణం చేయాల్సి ఉంది.

- బి. రమేష్, ఎంపీపీ, కొయ్యూరు

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవతి ప్రతిభ

అనకాపల్లి: దేవరాపల్లి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన అల్లు రేవతి జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో యూత్ జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మాల వెంకటరామ ఆమెను అభినందించారు. హిమాచల్‌ప్రదేశ్ నగ్రోటా బగ్వాన్ జిల్లాలో యూత్ జూనియర్, సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకూ జరిగాయని, ఈ పోటీల్లో రాష్ట్రం తరఫున యూత్ జూనియర్ విభాగంలో ఎ.రేవతి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని గుమ్మాల అన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన రేవతి(వృత్తంలో)

ఆనాటి స్నేహ మధురం..



సమావేశమైన 1995-2000 మధ్య విద్యను అభ్యసించిన విద్యార్థులు

కోటవురట్ల: చిన్నతనం నుంచి కలిసి చదువుకుని, ఎవరికివారే వేర్వైర ఎక్కడెక్కడో సెటిలై మళ్లీ కలుసుకుంటే ఆ మజాయే వేరు. పదో తరగతి వరకు కలిసిమెలసి చదువుతూ, చిలిపి చేష్టలతో గురువుల బెత్తం దెబ్బలు తింటూ గడిపిన ఆ రోజుల మధుర స్మృతులు, ఆ స్నేహ బంధం జీవితాంతం పెనువేసుకునే ఉంటుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-2000 మధ్య విద్యను అభ్యసించిన అప్పటి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఆనాటి తీపి గురుతులను స్మరణకు తెచ్చుకుని ఒకరినొకరు పరిచయం చేసుకుని సంతోషంగా గడిపారు. తమ ఉన్నతికి కారణమైన గురువులను సముచితరీతిలో సత్కరించి ప్రణమిల్లారు. సహపంక్తి భోజనం చేసి ఆటపాటలతో ఉత్సాహంగా కాలక్షేపం చేశారు. మళ్లీ కలుసుకుందామంటూ భారంగా వీడ్కోలు పలికారు.

అందరితో ఆనందంగా..



దసరా సంబరాల్లో భాగంగా పెదకోడాపల్లి గ్రామస్తులు

పెదకోడాపల్లి కాలనీలో వలస జీవుల సందడి

పెదబయలు: పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారంతా స్వగ్రామంలో సందడి చేశారు. పెదకోడాపల్లి కాలనీలో 40 కుటుంబాలు ఉండగా, అందులో సగం మంది వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి రీత్యా స్థిరపడ్డారు. దసరా సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో స్వగ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ యువత చెడు వ్యసనాల జోలికిపోకుండా ప్రపంచంతో పోటీపడి చదువుపై దృష్టి పెట్టాలని మేధావులు ఉద్బోధించారు. గ్రామ రైతులు ఆర్గానిక్ పద్ధతిలోనే వ్యవసాయం చేయాలని సూచించారు. రెండు రోజుల పాటు అన్ని కుటుంబాలు ఒకే చోట పిండి వంటలు, సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపాయి. భవిష్యత్తులో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశాయి. సర్పంచ్ బట్టి చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తెడబారికి సురేష్‌కుమార్, పాడేరు ఎంఈవో సల్లంగి విశ్వప్రసాద్, మోద వెంకటరమణ, పాంగి కుమారస్వామి, ధనుంజయ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 292 దరఖాస్తులు వచ్చాయని మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సిహెచ్.వి.ఎస్. ప్రసాద్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.35 వేలకు లడ్డూ దక్కించుకున్న సర్పంచ్



వేలంలో దక్కించుకున్న లడ్డూతో సర్పంచ్ వెంకటరమణ

మాకవరపాలెం: దుర్గమ్మ మండపంలో పూజలందుకున్న లడ్డూను బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ రూ.35 వేలకు దక్కించుకున్నారు. ఈ గ్రామంలో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ మండపం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సర్పంచ్ వెంకటరమణ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. కాగా మండలంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నవరాత్రులు ముగియడంతో వైభవంగా ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. తూటిపాలలో కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.